సాక్షి
వికారాబాద్
సోమవారం । 16 । జూన్ । 2025



పత్తి సాగుకు సమయమిదే..

పత్తి సాగుకు సరైన సమయమిదేనని.. నవాబుపేట మండల వ్యవసాయాధికారి జ్యోతి సూచిస్తున్నారు. 8లో▸



నీటి తొట్టి ధ్వంసం

పశువుల దాహార్తిని తీరుస్తున్న నీటితొట్టిని గ్రామానికి చెందిన ఓ నాయకుడు ధ్వంసం చేయించాడు. 8లో▸



కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

బొంరాస్‌పేట–బుర్రితండా డబుల్ రోడ్డు నిర్మాణం పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు లగచర్లలో రెవెన్యూ సదస్సు

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిషన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ భూ సమస్యల పరిష్కారానికి ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో అధికారులపై దాడి జరిగిన నేపథ్యంలో పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు సమాచారం.

ఘనంగా కేంద్ర మంత్రి జన్మదిన వేడుకలు



వికారాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న బీజేపీ శ్రేణులు

అనంతగిరి: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు వికారాబాద్‌లో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి విద్యార్థినేత నుంచి నేడు జాతీయ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారన్నారు. పార్టీలో క్రమశిక్షణగల నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా అహర్నిషలు ప్రజలకోసం పరితపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సదానందరెడ్డి, దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు, పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్‌గౌడ్, సీనియర్ నాయకులు సుధాకర్ ఆచారి, మోహన్‌రెడ్డి, రాములు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన బీసీ సంఘం నేతలు



ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

అనంతగిరి: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ కగార్ వెనుక కుట్ర

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పీర్ మహ్మద్

పరిగి: కేంద్రం మావోయిస్టులపై జరుపుతున్న ఆపరేషన్ కగార్ వెనుక కుట్ర కోణం దాగి ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పీర్ మహ్మద్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అటవీ సందపను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నా కావాలనే వరుస దాడులు కొనసాగిస్తోందన్నారు. ఆపరేసన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈ నెల 17న నగరంలోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పేదలను ఇబ్బంది పెట్టొద్దు

మాజీ మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: రాజకీయాల కోసం పేద ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హితవు పలికారు. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లకు చెందిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు తమ సమస్యలను ఆదివారం ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలోని పేదలకు దాదాపు 5వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఆన్‌లైన్ లక్కీడీప్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లకు చెందిన 1,800 మందికి డ్రా ద్వారా కేటాయించామన్నారు. స్థానికులకు 10 శాతం కేటాయించి ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అర్హులకు పట్టాలు ఇచ్చామని వివరించారు. కొంతమంది కావాలని కోర్టులకు వెళ్లి లబ్ధిదారులను ఇబ్బంది పెట్టే విధంగా చేస్తూ ఆనందం పొందుతున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులతో చర్చించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సన్నాలకు బోనస్ సున్నా

సన్నాలు కొనుగోలు చేసిన సర్కారు రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేయకుండా జాప్యం చేస్తోందని కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులు దాటినా నేటికీ నయా పైసా రాలేదని వాపోతున్నారు. అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రాసెస్‌లో ఉందని చెబుతున్నారే తప్ప స్పష్టత ఇవ్వడం లేదని మండిపడుతున్నారు.

- నెల రోజులు దాటినా జమకాని రూ.500 ప్రోత్సాహకం
- రైతులకు తప్పని ఎదురుచూపులు



పెరిగిన సాగు

పరిగి: వరిలో సన్నరకం పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అదనంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు సన్నాలు సాగు చేపట్టి ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ధాన్యం విక్రయించి నెల రోజులు కావస్తున్న బోనస్ డబ్బులు మాత్రం వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సేకరించిన 7,500 మెట్రిక్ టన్నుల సన్నాలకు గాను రూ.3.75కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ నగదు ఎప్పుడు జమ చేస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

ఆలస్యమైనా అక్కడే విక్రయం

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు తూకం వేయడంలో ఆలస్యం చేస్తున్నారు. ప్రభుత్వం బోనస్ ఇస్తుందనే కారణంగా రైతులు ఆలస్యమైనా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. మే మొదటి వారం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని ప్రభుత్వం ప్రకటించినా చెల్లింపుల్లో ఆలస్యంగా అవుతున్నాయి. సన్న రకం విక్రయించిన రైతులకు ముందుగా క్వింటాల్‌కు రూ.2,320 చొప్పున చెల్లించి తరువాత బోనస్ వేస్తున్నారు. బోనస్ మినహా మిగత డబ్బులు చాలా మంది రైతుల ఖాతాలో జమ అయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా సన్నరకం వరి సాగు భారీగా పెరిగింది. సాధారణంగా ఇక్కడి రైతులు వానాకాలం సీజన్‌లో సన్నాలు, యాసంగిలో దొడ్డు రకం పండిస్తారు. ప్రభుత్వం సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో యాసంగి సీజన్‌లో రైతులు దొడ్డురకంతో పాటు సన్నాలు సైతం ఎక్కువగానే సాగు చేశారు. వానాకాలం సీజన్‌లో సాగు చేసిన సన్నాలకు బోనస్ డబ్బులను ప్రభుత్వం ఆలస్యంగా వేసిందని అప్పట్లో అధికారులు మొదటి సీజన్ కావున కొంత ఆలస్యం అవుతాయని చెప్పారు. యాసంగిలో బోనస్‌ను త్వరగా అందిస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో బోనస్ డబ్బులు ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నెల రోజులైంది



ఐదెకరాల్లో సన్న రకం వరి సాగు చేయగా 65 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నెల రోజుల క్రితం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించా. బోనస్ డబ్బులు రూ.32 వేలు రావాల్సి ఉంది. నేటికీ జమ చేయలేదు. ప్రభుత్వం బోనస్ జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– మేకల శ్రీనివాస్, ఐనాపూర్

ప్రభుత్వానికి నివేదించాం

ఇప్పటి వరకు 7,500 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యం కొనుగోలు చేశాం. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను రెండు రోజుల వ్యవధిలోనే రైతు ఖాతాలో జమ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన బోనస్ డబ్బుల కోసం ప్రభుత్వానికి నివేదిక అందించాం. త్వరలోనే రైతుల ఖాతాలో జమ అవుతాయి.

– మోహన్ కృష్ణ, పౌరసరఫరాల శాఖ డీఎం, వికారాబాద్

కలెక్టర్ పాలన.. విజయ పథాన

- ప్రతీక్‌జైన్ బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది పూర్తి
- సంక్షేమం దిశగా పరుగులు పెట్టించేందుకు తనదైన మార్క్



వికారాబాద్: ఓ పక్క సంక్షేమ పథకాలను ఇబ్బందులు తలెత్తకుండా ప్రజల వద్దకు చేర్చడంతో పాటు మరో పక్క పాలన గాడిన పెట్టడంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ చాలా వరకు సక్సెస్ అయ్యారు. మొదటిసారి వికారాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన మొదట్లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. చివరకు తేరుకుని పాలన గాడిలో పెట్టారు. నేటితో ఆయన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతుండటంతో జిల్లాపై ఆయన వేసిన ముద్ర ఎదుర్కొన్న సమస్యలు, లోటుపాట్లపై ఓ పరిశీలిద్దాం..

అధికార యంత్రాంగం పనితీరుపై..

జిల్లాలో ప్రధానంగా కలెక్టరేట్‌లో పరిస్థితిని చక్కదిద్దేందుకు కంకణం కట్టుకున్న కలెక్టర్ వచ్చీ రాగానే అన్ని శాఖల యంత్రాంగం సేవలు ప్రజలకు అందడంలో ఇబ్బందులు, జాప్యంలేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఆఫీస్ సబార్డినేట్ నుంచి జిల్లా అధికారుల వరకు అన్ని శాఖల యంత్రాంగం పనితీరును మెరుగపరిచేందుకు తీసుకున్న చర్యలు సత్ఫాలితాలిచ్చినట్లే కనిపిస్తున్నాయి. తరచూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షణను బలోపేతం చేయటంలోనూ సఫలీకృతమయ్యారు. ధరణి నుంచి భూ భారతి సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతూ దిగ్విజయంగా ఏడాది పూర్తి చేసుకున్నారు.

4,500 ధరణి సమస్యలు పరిష్కారం

జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ధరణి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. బాధ్యతలు తీసుకున్నది మొదలు రోజుకు 150 సమస్యలకు తక్కువ కాకుండా ధరణి సమస్యలు పరిష్కరిస్తూ వచ్చారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయటంతో పాటు సేవలు మెరుగుపర్చారు. ప్రతీ సోమవారం జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. చిన్న చిన్న సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరిస్తూ వస్తున్నారు. సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతున్నారు. 5 వేల వరకు ఉన్న ధరణి దరఖాస్తులు నేడు 400లోపే వచ్చాయి.

విద్య, వైద్యంపై స్పెషల్ ఫోకస్

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించంలో తనదైన ముద్ర వేశారు. ప్రతీ హాస్టల్‌కు తనే స్వయంగా వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. నిధులు కేటాయించి వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆస్పత్రులను తరచూ విజిట్ చేస్తూ వైద్య సేవలు అందరికి అందేలా చొరవ చూపారు. ఆస్పత్రుల్లో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ బియ్యం సరఫరా, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై దృష్టి సారించి ప్రజలకు అందించడంలో ప్రత్యేక చొరవ చూపారు.

భూసేకరణలో సక్సెస్

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం లగచర్లలో ఆయనతో పాటు ఇతర అధికారులు, పోలీసులపై జరిగిన దాడి ఘటన చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఆ ఘటన నుంచి సాధ్యమైనంత తొందరగానే బయటపడిన ఆయన తిరిగి పారిశ్రామిక ప్రగతిని ముందుకు తీసుకువెళ్లడంలో విజయం సాధించారు. పారిశ్రామిక వాడ కోసం భూములు సేకరించే విషయంలో సక్సెస్ అయ్యారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేలా చూడడంలో ఆయన శ్రమ ఫలించింది.



మోహన్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న గురునాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు

మోహన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి

దౌల్తాబాద్: ప్రజా సంక్షేమానికి పరితపించిన నాయకుడు మోహన్‌రెడ్డి అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గుర్‌నాథ్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌రెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద వారు పార్టీ శ్రేణులతో కలిసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల రాజకీయంలో సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీగా పనిచేసిన ఆయన ప్రజల గుండెల్లో చెరిగిపోని ముద్ర వేసుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి

- తాండూరులో స్టేడియం ఏర్పాటు చేయాలి
- భారత మాజీ క్రికెటర్ అజహరుద్దీన్

తాండూరు: క్రీడల్లో ప్రావీణ్యం సాధించేందుకు క్రీడా ప్రాంగణాలు దోహద పడుతాయని భారత మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ అన్నారు. ఆదివారం విలియంమూన్ మైదానంలో జీఎంకే ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు ఆయన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ట్రస్ట్ ఫౌండర్ ముజీబ్‌ఖాన్‌తో, నాయకుడు సంపత్ కుమార్‌తో కలిసి హాజరయ్యారు. 64 జట్లు తలపడిన ఈ టోర్నీలో అల్‌పూర్ ఖాన్ టీం, జీఎంకే టీమ్ ఫైనల్‌లో హోరాహోరీగా తలపడ్డాయి. అనంతరం విజేత జట్టు అల్‌పూర్‌ఖాన్ టీం, రన్నర్‌గా నిలిచిన జీఎంకే టీంలకు నగదు బహుమతి, కప్ అందేశారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహిస్తే క్రీడాకారులుగా రాణిస్తారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. తాండూరులో తరచూ క్రికెట్ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పట్టణంలో స్టేడియం అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు ప్రాంత యువత కోసం స్టేడియం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు వేలాదిగా అభిమానులు తరలి వచ్చారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ

జూబ్లీహిల్స్ అసెంబ్లీకి ఉప ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉంటానని భారత మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ అన్నారు. ఇటీవల జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైందని.. ఆఎన్నికలో మీరు పోటీలో ఉంటారా అని విలేకరులు ప్రశ్నించగా.. కాంగ్రెస్ నుంచి పోటీలో ఉంటానని ప్రకటించారు.



విన్నర్‌గా నిలిచిన అల్‌పూర్‌ఖాన్ జట్టుకు బహుమతి అందిస్తున్న అజహరుద్దీన్, ఎమ్మెల్యే బీఎంఆర్

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్, చౌడాపూర్ తదితర గ్రామాల్లో 242మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకుంటున్నారన్నారని వివరించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు నిర్మించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరక్టర్ రామ్మోహన్ శర్మ, చౌడాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లాటి అశోక్‌కుమార్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, సలీం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యత

దోమ: మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి దాదాపూర్ రైతు వేదికలో 249 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతకు రాజీవ్ యువ వికాసం పథకం కింద ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు సాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. సన్న బియ్యం పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవ రెడ్డి, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు అనసూయ, ఏఎంసీ డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, శాంత్ కుమార్, బద్రి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రమేష్ గౌడ్, పార్టీ నాయకులు రాఘవేందర్ రెడ్డి, యాదయ్యగౌడ్, అంతిరెడ్డి, బాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజు, బసన గౌడ్, మొగులయ్య గౌడ్, శేఖర్, చెనయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు శాసించే స్థాయికి ఎదగాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్



రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న బర్కకృష్ణయాదవ్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: బీసీలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ శివారులోని ఎన్‌హెచ్–44 హోటల్‌లో ఆదివారం బీసీసేన జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలైన బీసీలు సమాజంలో గణనీయమైన వాటా కలిగి ఉన్నారని అన్నారు. జనాభా ప్రకారం అత్యధికంగా ఉన్నప్పటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అనుకున్న స్థాయిలో ఎదగలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగుబలహీన వర్గాలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని తెలిపారు. జనాభా ప్రకారం అధికంగా ఉన్న బీసీలు రాజ్యాధికార సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీసేన జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీసేన నాయకులు సుధాకర్, చంద్రశేఖర్, వరలక్ష్మి, శారద, వెంకటేశ్, దేవేందర్, సౌజన్య, జక్కుల జలజ, స్రవంతిరాజ్, భాగ్యలక్ష్మి, అనిత, శ్రీనివాస్, శివకుమార్, మహేష్, వరప్రసాద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం వెంటనే కులగణన చేపట్టాలి

హయత్‌నగర్: స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా ఏ వర్గం వారి జనాభా ఎంత ఉందో లెక్కలు లేకపోవడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర వర్గ సభ్యుడు రవీంద్రాచారి, కౌన్సిల్ సభ్యుడు మాదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన పార్టీ కుంట్లూరు శాఖ మహాసభలో వారు మాట్లాడారు. కేంద్రం తక్షణం స్పందించి కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు కార్పొరేట్ విద్య, వైద్యం ఉచితంగా అందజేయాలన్నారు.

క్లుప్తంగా

పద్మమ్మకు నివాళి



పద్మమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సబితారెడ్డి తదితరులు

ధారూరు: మండల పరిధిలోని చింతకుంటలో ఆదివారం దివంగత ఇంద్రారెడ్డి సోదరి పద్మమ్మ దశదిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సబితారెడ్డి హాజరై నివాళి అర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు హఫీజ్ తదితరులు హాజరయ్యారు.

విద్యుదాఘాతంలో ఆవు మృతి



ఆవు కళేబరం

తాండూరు రూరల్: విద్యుదాఘాతంలో ఓ ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన పెద్దేముల్ మండలం ఎర్రగడ్డతండాలో ఆదివారం చోటు చేసుకుంది. తండాకు చెందిన శాంతబాయి రోజు మాదిరిగానే ఆవులను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో తండాశివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ.50 వేలు ఆర్థికంగా నష్టపోయానని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుతోంది.

పశువుల నీటి తొట్టి ధ్వంసం



ధ్వంసమైన నీటి తొట్టి

బషీరాబాద్: పశువుల దాహార్తిని తీరుస్తున్న నీటితొట్టిని గ్రామానికి చెందిన ఓ నాయకుడు ధ్వంసం చేయించాడు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మూగజీవాల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం.. ఉపాధి నిధులతో పదిహేనేళ్ల క్రితం తొట్టిని నిర్మించింది. తొట్టి ఉన్న స్థలాన్ని కబ్జా చేసేందుకు ఓ జాతీయ పార్టీకి చెందిన యువ నాయకుడు జేసీబీతో ధ్వసం చేయించాడు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన సదరు వ్యక్తిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పేదలకు వరం ఇందిరమ్మ ఇళ్లు



ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించిన నాయకులు

కుల్కచర్ల: పేదలకు వరం ఇందిరమ్మ ఇళ్లు అని, అర్హులందరికీ ప్రభుత్వం ఇంటిని నిర్మించి ఇస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండల పరిధి ముజాహిద్‌పూర్‌లో లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు షర్ఫొద్దీన్, సోమలింగం, రాములు, అంబదాస్, కిష్టయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

198 మందికి వైద్య పరీక్షలు

యాలాల: మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్‌లో ఆదివారం తాండూరు వాసవి ఆస్పత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 198 మంది ప్రజలు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్లు ఆస్పత్రి యజమాని సతీశ్ కుమార్, వైద్యుడు విజేందర్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలతో పాటు మందులను పంపిణీ చేస్తున్నామన్నారు.

కాడెద్దు అపహరణ

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కాడెద్దును తరలించుకుపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు బైకని పర్వతాలు యాదవ్.. పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ పొలం వద్ద ఐదు ఆవులు, రెండు కాడెడ్లను ఉంచాడు. ఆమనగల్లు– షాద్‌నగర్ రహదారి పక్కనే పశువుల పాక ఉండటంతో.. దుండగులు రూ.లక్ష విలువ చేసే ఎద్దును అపహరించారు. ఆదివారం ఉదయం పాక లో ఓ ఎద్దు లేదని గుర్తించిన బాధిత రైతు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పత్తి సాగుకు సమయమిదే..

- విత్తన రకం, నేల స్వభావమే ప్రధానం
- భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడాలి
- మండల వ్యవసాయాధికారి జ్యోతి



జ్యోతి, మండల వ్యవసాయాధికారి

నవాబుపేట: పత్తి సాగుకు సరైన సమయమిదేనని.. తగు జాగ్రత్తలు తీసుకుంటే రైతులకు తెల్లబంగారం లాభాలు ఆర్జించి పెడుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో రైతులు అధికంగా పత్తి సాగుకు మొగ్గు చూపుతారు. కానీ ఏడాది గతంతో పోల్చితే తగ్గే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు. గత ఏడాది సరైన సమయంలో వర్షాలు కురువక దిగుబడులు తగ్గడం.. ఖర్చులు పెరగడంతో ఆశించిన లాభాలు రాలేదు. దీంతో మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది వానాకాలం మండల పరిధిలో 21,539 ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. మొక్క జొన్న 744 ఎకరాలకే పరిమితమైంది. ఈ సీజన్‌లో 19,230 ఎకరాల్లో పత్తి 2,317 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

నల్లరేగడి భూములు అనుకూలం

పత్తి సాగుకు నల్లరేగడి భూములు అనుకూలమైనవి. నీటి సదుపాయం కలిగిన సారవంతమైన ఎర్రనేలల్లోనూ వేసుకోవచ్చు. సమస్యాత్మక భూములు తరుచుగా నీటి ఎద్దడికి గురయ్యే నేలలు, మురుగునీటి పారుదల సౌకర్యం లేని నేలల్లో సాగు చేపట్టొద్దు. తొలకరి వర్షాలు పడిన తర్వాత పొలాన్ని రెండు నుంచి మూడుసార్లు కలియ దున్నుకోవాలి. విత్తనాలు ఏ పద్ధతి లో వేసుకోవాలన్నది విత్తన రకం, నేల స్వభావంపై ఆధారపడి ఉంటుంది. అవకాశం ఉన్నవారు ఆఖరి దుక్కిలో ఎకరానికి పది టన్నుల పశువుల ఎరువు వేయాలి. చివరి దుక్కిలోనే 150 కిలోల సింగల్ సూపర్‌పాస్ఫేట్ వేసి కలియదున్నాలి. భూమి బాగా తడిసిన తర్వాత అంటే 60 నుంచి 70 మీల్లీటర్ల వర్ష పాతం నమోదైన ఐదు రోజుల తర్వాత విత్తనాలు వేసుకోవాలి. నల్లరేగడి నేలల్లో 60 నుంచి 70 శాతం తేమ ఉంటేనే ఎర్రనేలల్లో 50 నుంచి 60 శాతం తేమ ఉంటే విత్తనం వేసుకోవచ్చు.

విత్తన ఎంపిక

పత్తిలో చాలా రకాలున్నాయి. నమ్మకమైన కంపెనీలు, డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలి. పత్తిలో సూటి, సంకర రకాలున్నాయి. చాలా మంది బీటీ పత్తినే సాగు చేస్తున్నారు. మైకో, నూజివీడు, కావేరి, బ్రహ్మ, బోల్‌గార్డ్, అజీత్, ఇలా చాలా కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఎవరికి నచ్చిన విత్తనాలు వాళ్లు విత్తుకోవాలి. పంటకాలం పూర్తయ్యే వరకు రసీదులు భద్రపరుచుకోవాలి.

ఎరువులు వేయడం

ఎకరాకు 60 నుంచి 80 కిలోల నత్రజని, 25 నుంచి 35 కిలోల భాస్వరం, 25 నుంచి 35 కిలోల పొటాష్ వేసుకోవాలి. భాస్వరం, పొటాష్‌లను మూడు సమ భాగాలుగా చేసుకొని విత్తిన 30 రోజులకు , 60 రోజులకు, 90 రోజులకు వేసుకోవాలి. భూసార పరీక్షలు చేయించుకుని తదనుగుణంగా సిఫారస్సు చేసిన ఎరువులు వాడితే పోషకాలు సమపాళ్లలో అందడంతో ఖర్చు తగ్గుతుంది.

విత్తన నమోదు

ఎకరానికి 650 గ్రాముల విత్తనాలు సరిపోతాయి. నేలసారాన్ని బట్టే విత్తే దూరం ఎంచుకోవాలి. బలమైన నల్లరేగడి నేలల్లో 90 ప్లస్ 90 సెంటీ మీటర్లు, మధ్యస్థ నేలల్లో వరుసల మధ్య దూరం 90 సెంటీ మీటర్లు, మొక్కల మధ్య దూరం 90 సెంటీ మీటర్లు ఉండేట్లు విత్తుకోవాలి. బీటీ పత్తి చుట్టూ రెండు నుంచి నాలుగు వరుసలు నాన్‌బీటీ పత్తిని ఖచ్చితంగా విత్తుకోవాలి.



పులుమామిడిలో ఇటీవల సాగు చేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

భగీరథ నీటిలో పురుగులు



మిషన్ భగీరథ నీటిలో వచ్చిన పురుగులు



వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆందోళనలో గ్రామస్తులు

దుద్యాల్: మండల కేంద్రంలో ఆదివారం సరఫరా చేసిన మిషన్ భగీరథ నీటిలో పురుగులు ప్రత్యక్షమయ్యాయి. ఒండ్రుమట్టి రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఇదే విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాఘవేందర్‌ను వివరణకోరగా రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగలేదని.. ట్యాంకులో మట్టి ఉందేమోనని శుభ్రం చేయించామన్నారు. మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

కొడంగల్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం 3 గంటలకు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లను ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి జి.తులసి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పర్సాపూర్, రావులపల్లి, చిట్లపల్లి గ్రామాల్లోని రైతు వేదికల్లో లైవ్‌గా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ద్వారా ప్రతీ మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులతో రైతులకు ప్రత్యక్ష్య సంప్రదింపులు జరిపే అవకాశం ఉంటుందని తెలిపారు. పంటల యాజమాన్య పద్ధతులు, వ్యవసాయంలో నూతన సాంకేతికత, పంటలలో వచ్చే చీడ, పీడలు, సమస్యలకు పరిష్కారం, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.

రైతు నేస్తం వీక్షించేందుకు..

యాలాల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హాజరవనున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షించేందుకు రైతు వేదికలో ఏర్పాట్లు చేసినట్లు మండల వ్యవసాయాధికారి శ్వేతారాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాస్నం, యాలాల, అగ్గనూరు రైతు వేదికల్లో సాయంత్రం 4గంటలకు ఈ వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. నాయకులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు హాజర్వాలని కోరారు.

కుల్కచర్ల రైతువేదికలో..

కుల్కచర్ల: రైతు భరోసా నిధులపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వీరస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటలకు కుల్కచర్ల, కుస్మసముద్రం గ్రామాల్లోని రైతువేదికలో ఇందుకు సంబంధించిన వీడియోకాన్ఫరెన్స్ ఉంటుందని రైతులు హాజరవ్వాలని కోరారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజు భూపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం.. ఆ పార్టీ భవనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ నారాయణయాదవ్ అధ్యక్షతన స్థానిక వైష్ణవిగార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

అలుగు ఆధునికీకరణ ఎప్పుడో!



కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగుపై సీసీ బెడ్ నీటి ప్రవాహ ఉధృతికి చిత్తడిగా మారింది. 2021లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టు పూర్తిగా నిండి నీటి ఉధృతి అలుగుపై పారడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. అప్పట్లో మరమ్మతు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేపట్టడంతో తిరిగి శిథిలమైంది. ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.110 కోట్లు మంజూరయ్యాయని చెబుతున్నా పనుల్లో పురోగతి లేదని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – ధారూరు

నెత్తిన మృత్యుపాశాలు!



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇళ్లలో వెలుగులు నింపాల్సిన విద్యుత్ తీగలు.. పౌరుల జీవితాల్లో చీకట్లు నింపుతున్నాయి. నెత్తిన మృత్యుపాశాల్లా వేలాడుతున్న వైర్లు ఎప్పుడు.. ఎవరిపై తెగిపడతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఎలాంటి ఈదురు గాలులు, వర్షాలు లేకపోయినప్పటికీ.. వైర్లు తెగిపడుతుండటాన్ని పరిశీలిస్తే.. డిస్ట్రిబ్యూషన్ లైన్ల వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో అర్థమవుతోంది. విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. అయినా ప్రమాదాలు తగ్గడంలేదు. తాజాగా సరూర్‌నగర్ డివిజన్ చింతల్‌కుంట ఫీడర్‌కు సంబంధించిన 11 కేవీ పోల్‌పై పాలిమర్ పిన్ ఇన్సులేటర్‌లోని మెటల్ రాడ్డు విరిగిపడి, హైటెన్షన్ విద్యుత్ కేబుల్ తెగిపడటంతో.. సాగర్ రింగ్‌రోడ్డు సమీపంలోని ఓ దేవాలయం ఫుట్‌పాత్‌పై నిద్రపోతున్న ఓ మహిళ, పురుషుడు (యాచకులు) విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డారు. విద్యుత్ ఇంజినీర్లు మాత్రం తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు గుర్తు తెలియని ఓ వాహనం స్తంభాన్ని ఢీకొనడంతోనే వైర్లు తెగిపడినట్లు చెబుతున్నారు.

నిర్వహణ లోపంతోనే..

ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే ఉన్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ వైర్లు తెగిపడుతుండటంతో పాటు స్తంభాలను ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, లూజు లైన్లు సరి చేయడం, దెబ్బతిన్న పిన్ ఇన్సులేటర్లను మార్చడం, పాడైన ఫ్యూజ్ బాక్సులను మార్చడం, డీటీఆర్‌ల వద్ద పటిష్టమైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లు ఖర్చు చేస్తోంది. కంపెనీ కేటాయించిన నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి తప్ప.. సరఫరా వ్యవస్థ మాత్రం మెరుగుపడటం లేదు. క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు ఎప్పటికప్పుడు లైన్ టు లైన్, పోల్ టు పోల్ తిరిగి ప్రమాదకరంగా మారిన వాటిని గుర్తించి, వాటి స్థానంలో కొత్త వైర్లు, స్తంభాలు, పిన్ ఇన్సులేటర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. లైన్ల పునరుద్ధరణ అంటే కేవలం చెట్ల కొమ్మల తొలగింపు ఒక్కటే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

ప్రతిపాదనలకే సరి..

వేలాడుతున్న వైర్లను తొలగించి, వాటి స్థానంలో భూగర్భ విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేయాలని డిస్కం నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఇంజినీర్ల బృందం ఇటీవల బెంగళూరులో పర్యటించి భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను పరిశీలించి వివరాలను సేకరించింది. 3,400 కిలోమీటర్ల 33 కేవీ, 11,500 కిలోమీటర్ల 11 కేవీ లైన్లలో యూజీ కేబుళ్ల లైన్లు, 15 వేల కిలోమీటర్ల ఏబీ కేబుల్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందు కోసం రూ.13,600 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేసింది. బకాయిలు భారీగా పేరుకపోవడం, ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో డిస్కం ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం నిధుల్లేవంటూ చేతులెత్తేసింది. కేంద్రం దయతలచి ఏదైనా స్కీం ప్రకటిస్తే గాని.. ఈ పనులు ఇప్పట్లో పూర్తికాని పరిస్థితి నెలకొంది.

విద్యార్థి అదృశ్యం



దివ్యసాయి (ఫైల్)

పహాడీషరీఫ్: విద్యార్థి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లి ముదిరాజ్ కాలనీకి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ రాకోటి మురళీమోహన్ కుమారుడు దివ్యసాయి(19) నీట్ పరీక్ష రాసి ఫలితాల కోసం నిరీక్షిస్తున్నాడు. ఈ నెల 9న తల్లిదండ్రులు పనిమీద బయటికి వెళ్లి మధ్యాహ్నం వచ్చి చూడగా దివ్యసాయి కనిపించలేదు. అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 87126 62367 నంబర్‌లో గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

పరీక్ష రాసేందుకెళ్లి..

ఇబ్రహీంపట్నం: పరీక్ష రాసేందుకని వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ జగదీశ్ కథనం ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన విద్యార్థిని (23) ఇబ్రహీంపట్నం మండలం రాందాసుపల్లి పరిధిలోని ఏవీఎన్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. శుక్రవారం ఉదయం 6 గంటలకు పరీక్ష రాసేందుకు కళాశాలకు బయలుదేరి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

దోమ: జూలై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సమితి మండల ఉపాధ్యక్షుడు బొంపల్లి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల పరిధి అన్ని గ్రామాల్లో జెండా దిమ్మెలను ఏర్పాటు చేసి, జెండాలను ఆవిష్కరించాలని సూచించారు.

కొడుకు జ్ఞాపకాలతో విరాళం

ఆలయ అభ్యుద్ధికి హామీ



హన్మిరెడ్డి, దాత

బొంరాస్‌పేట: కొడుకు లేడన్న బాధను దిగమింగుకొని, పుత్రుడి జ్ఞాపకాలతో ఓ తండ్రి.. ఫాదర్ డే రోజు ఆదివారం ఆలయానికి రూ.10 వేలతో గంట, గేటు చేయించాడు. మరో నాలుగేళ్లలో పురాతన ఆలయానికి మరమ్మతు పనులు చేయిస్తానని హామీ ఇచ్చాడు. మండల పరిధి రేగడిమైలారానికి చెందిన గుర్మిట్‌కల్ హన్మిరెడ్డి కొడుకు నవీన్‌కుమార్‌రెడ్డి.. గతేడాది పొలం పనులకు వెళ్తూ విద్యుదాఘాతంతో చనిపోయాడు. కొడుకు అకాల మరణం చెందడాన్ని జీర్ణించుకోలేని ఆ తండ్రి.. తన బిడ్డ చనిపోలేదని, నేరుగా శివుడి వద్దకు చేరాడని పేర్కొనడం గమనార్హం. కొడుకు చనిపోయాడన్న బాధలో ఉండి కూడా.. ఆలయానికి తనకు తోచిన విరాళం అందజేసిన దాత హన్మిరెడ్డికి ఆలయ పూజారి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జగదీశ్వరయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో చోరీ

ఇబ్రహీంపట్నం: ఓ దేవాలయంలో గుర్తు తెలియని దుండుగులు చోరికి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరిగూడ గ్రామ శివారులోని మల్లన్న స్వామి ఆలయానికి ఎల్లపల్లి శ్రీరాములు దంపతులు ఆదివారం సాయంత్రం వెళ్లారు. ఆలయ ప్రాంగణంలో విగ్రహాలు పడిపోయి ఉండటం, అమ్మవారి మెడలోని 7.5 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు, 2 తులాల వెండి కాలి మెట్టలు లేకపోవడం గుర్తించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా గ్రామాలకు దూరంగా ఉన్న ఆలయాల వద్ద సీసీ కెమెరాలను అమర్చి, తగిన భద్రత ఏర్పాటు చేసుకోవాలని సీఐ జగదీశ్ భక్తులకు సూచించారు.

నగరంలో పెర్ఫ్యూమర్ మెన్..

22న ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్ఫ్యూమ్‌లతో ప్రత్యేక ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: నగర సంస్కృతిలో పర్ఫ్యూమ్ వందల సంవత్సరాలుగా ఉందని దుబాయ్‌కు చెందిన ప్రముఖ పెర్ఫ్యూమర్ యూసఫ్ బాయ్ తెలిపారు. నగరానికి తొలిసారి వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ.. నిజాం కాలం నుంచి సుగంధ ద్రవ్యాల వినియోగం ఉందని, ఇది నగర సంస్కృతిలో భాగమని అన్నారు. ఈ నెల 22న బంజారాహిల్స్‌లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్ఫ్యూమ్‌లతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భారత్‌లో యేటా సుగంధ ద్రవ్యాల కోసం 10 వేల కోట్ల ఖర్చు పెడుతున్నారని, ఇది మరో ఐదేళ్లలో 20 వేల కోట్లకు పెరగనుందని అన్నారు. దీంతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. 150 సంవత్సరాల క్రితం టర్కీలో ప్రారంభమైన పెర్ఫ్యూమ్ కల్చర్ క్రమంగా ప్రపంచం మొత్తం వ్యాపించిందన్నారు. పెర్ఫ్యూమ్ తయారీ కూడా ఒక కళేనని, ప్రకృతిలోని ప్రతి వస్తువుతో పెర్ఫ్యూమ్ తయారు చేయడం సాధ్యమవుతుందన్నారు. యూసఫ్ బాయ్ సంస్థ ఫౌండర్, చైర్మన్ అబ్దుల్ జలాల్, బిలాల్ అబ్దుల్, ముకీత్ అతీఫ్, ముజాహిద్ అహ్మద్ పాల్గొన్నారు.

‘అపూర్వ’ సమ్మేళనం

32 ఏళ్ల తర్వాత కలుసుకున్న చించల్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు



చించల్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్ 1992-93 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు



బొంరాస్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్ 1997-98 బ్యాచ్ విద్యార్థులు

వికారాబాద్: ఆత్మీయం.. అపురూపం అన్నట్టుగా మారింది.. ఆ సమ్మేళనం..32 వసంతాల సుదీర్ఘ కాలం తరువాత కలిసిన ఆ పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలు నెమరేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యేలా చేశాయి. నవాబుపేట మండలం చించల్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 1992–93లో పదో తరగతి చదవిన విద్యార్థులు ఆదివారం వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమంలో కలిశారు. నాడు వారికి విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, విష్ణుచిత్తం, సత్యనారాయణరెడ్డి, గోవర్దన్, యూసెఫ్‌లతో పాటు ప్రస్తుతం ఆ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాడు పాండును ఘనంగా సన్మానించారు.

పాతికేళ్ల అనంతరం..

బొంరాస్‌పేట: పదో తరగతి వరకు ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత ఆదివారం కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ గురువులకు పాదాభివందనాలు చేసి తరించారు. 1997–98లో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన 56మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయతను పంచుకున్నారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన వెంకట్రాములుగౌడ్, నర్సప్ప, చెన్నబసప్ప, సాయన్నగౌడ్, సాయిబన్న, చంద్రశేఖర్‌గౌడ్‌లను శాలువాలతో సన్మానించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరిలాల్ పాల్గొన్నారు.